## ‘జీవితాంతం బీఆర్‌ఎస్‌లోనే ఉంటా..’

సదాశివనగర్, నవంబర్ 18: తాను జీవితాంతం బీఆర్‌ఎస్‌లోనే ఉంటూ సేవలను అందిస్తానని ఉత్తునూర్ విండో చైర్మన్ ప్రభాకర్‌రావు అన్నారు. విండో కార్యాలయంలో ఆయన శనివారం ‘నమస్తే తెలంగాణ’తో మాట్లాడారు. రెండు రోజుల క్రితం కాంగ్రెస్ వారు ఇంటికి వచ్చి నీళ్లు అడిగితే ఇచ్చానని, వారు ఫొటోలు తీసి తనకు తెలియకుండానే కాంగ్రెస్‌లో చేరినట్లు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారన్నారు. దీంతో శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే సురేందర్‌ను కలిసి బీఆర్‌ఎస్ కండువా కప్పుకున్నానని తెలిపారు. తాను పార్టీని విడిచిపెట్టేది లేదన్నారు.

## క్రిష్ణాజివాడి పాఠశాలలో స్వయంపాలన



స్వయంపాలనలో పాల్గొన్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

తాడ్వాయి, నవంబర్ 18: మండలంలోని క్రిష్ణాజివాడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం స్వయంపాలన దినోత్సవాన్ని నిర్వహించినట్లు హెచ్‌ఎం రామస్వామి తెలిపారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలను బోధించారు. హెచ్‌ఎంగా రాఘవేందర్ వ్యవహరించారు. మంచిగా బోధించిన వారికి బహుమతులను అందజేశారు.

## విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం

నిజాంసాగర్, నవంబర్ 18: నిజాంసాగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయుడు రాంచందర్ మాట్లాడుతూ.. ప్రతినెలా మూడో శనివారం పేరెంట్స్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎస్సెస్సీ విద్యార్థుల కోసం సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని, పిల్లలు తరగతులకు హాజరయ్యేలా తల్లిదండ్రులు చూడాలని కోరారు. ఇంటింటా చదువుల పంట యాప్ ఆవశ్యకతను తల్లిదండ్రులకు వివరించారు. సమావేశంలో ఉపాధ్యాయులు వెంకటేశం, రాములు, రాజేందర్, విజయ్‌కుమార్, సంఘమిత్ర తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి

- ఇక్కడే పుట్టా.. ఇక్కడే ఉంటా..
- 22వ ప్యాకేజీతో గుజ్జుల్, కాటేవాడి చెరువుల్లోకి నీరు
- ఎల్లారెడ్డి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాజాల సురేందర్



ఎమ్మెల్యే సురేందర్‌కు స్వాగతం పలుకుతున్న మహిళలు, ఇన్‌సెట్‌లో పూజలు చేస్తూ..

గాంధారి, నవంబర్ 18: నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి మరోసారి తనను ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపించాలని ఎల్లారెడ్డి బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి సురేందర్ ఓటర్లను కోరారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం మండంలోని మండలంలోని చద్మల్ తండా, చద్మల్, నౌసీరాం తండా, దుబ్బతండా, నేరల్, నాగ్లూర్, నాగ్లూర్‌తండా, నేరల్ తండా, పిస్కిల్ గుట్ట తండా, బీర్మల్ తండా, జెమిని తండా, డప్పు తండా, కొత్తబాది, దుర్గం, లొంకతండా, పెద్ద గుజ్జుల్ తండా, చిన్న గుజ్జుల్ తండా, సోమారం తండా, అవుసుల కుంట తండా, గొల్లాడి తండా, తిప్పారం, తిప్పారం తండా, బొప్పజివాడి, బూర్గుల్, సోమ్లానాయక్ తండా, పంతులు నాయక్ తండా, కరక్‌వాడి, గుడిమెట్ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఆనవాయితీ ప్రకారం ముందుగా చద్మల్ తండాకు వెళ్లిన ఆయనకు మధుర లంబాండీలతోపాటు బీఆర్‌ఎస్ శ్రేణులు సంప్రదాయ నృత్యాలతో ఘన స్వాగతం పలికారు. చద్మల్ తండాలోని లక్ష్మమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ప్రచారాన్ని ప్రారంభించారు. నియోజకవర్గంలో ఈ ఐదేండ్ల కాలంలో ఎన్నో అభివృద్ధి పనులను చేశానని అన్నారు. ప్రస్తుతం ఎన్నికలు రావడంతో బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులకు ప్రజలు కనిపిస్తున్నారని అన్నారు. కరోనా కష్టకాలంలోనూ సంక్షేమ పథకాలు ఆగలేదని తెలిపారు. రాష్ట్రం ఏర్పడక ముందు తండాలు ఏవిధంగా ఉన్నాయి..? ప్రస్తుతం ఎలా ఉన్నాయో గమనించాలని సూచించారు. మక్క పంట వద్దన్నా ఇక్కడి రైతులు సాగుచేయడంతో సీఎం కేసీఆర్‌ను కోరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయించామని అన్నారు. రైతులను రాజును చేస్తున్న ఏకైక ప్రభుత్వం కేసీఆర్ ప్రభుత్వమని తెలిపారు. మూడు గంటల కరెంటు ఇస్తామని అంటున్న కాంగ్రెస్‌కు అధికారం అప్పగిస్తే.. రైతులు వ్యవసాయం ఎలా చేస్తారో ఆలోచించాలన్నారు. తాను లోకల్ వ్యక్తిని అని 24 గంటల పాటు అందుబాటులో ఉంటానని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న పోడు భూముల సమస్యను పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. 22వ ప్యాకేజీతో గుజ్జుల్, కాటేవాడి చెరువులు నీటితో నిండుతాయని తెలిపారు. కారు గుర్తుకు ఓటేసి తనను గెలిపించాలని, దీంతో కేసీఆర్ మూడోసారి సీఎం అవుతారని తెలిపారు. ప్రచార కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు శివాజీరావు, జడ్పీటీసీ శంకర్‌నాయక్, ఎంపీపీ రాధాబలరాం, మాజీ జడ్పీటీసీ తానాజీరావు, గాంధారి సర్పంచ్ మమ్మాయి సంజీవ్, విండో చైర్మన్ పెద్దబూరి సాయికుమార్, ఎంపీటీసీ పత్తి శ్రీను, నాయకులు ముకుంద్‌రావు, పెద్దబూరి సత్యం, సీతాయిపల్లి శ్రీను, తాన్‌సింగ్ నాయక్, నాగ్లూర్ సతీశ్, రొడ్డోళ్ల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రచార హోరు

నమస్తే తెలంగాణ యంత్రాంగం, నవంబర్ 18: బీఆర్‌ఎస్ అభ్యర్థి సురేందర్ తరఫున ఆ పార్టీ నాయకులు ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఇప్పటివరకు చేసిన అభివృద్ధిని వివరిస్తూ కారు గుర్తుకు ఓటేయాలని ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరిస్తున్నారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే పింఛన్లు, రైతుబంధును దశల వారీగా పెంచుతుందని తెలుపుతున్నారు.



గోపాల్‌పేట్‌లో ప్రచారం చేస్తున్న జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి



జాజాల సురేందర్ వెంటే ఉంటామని మద్దతు తెలుపుతున్న సదాశివనగర్‌లోని వృద్ధులు

# ధరణి తీసేస్తే మళ్లీ ఆగమే..

- కాంగ్రెసోళ్లకు ఏం తెలుసు రైతుల కష్టాలు
- రైతులను బానిసలు చేయాలని చూస్తుండ్రు
- పాత పద్ధతి వస్తే మళ్లీ తిప్పలు తప్పవు
- కాంగ్రెస్ భూమాత పోర్టల్ ప్రకటనపై అన్నదాతల ఆగ్రహం



కాంగ్రెస్ పార్టీ వస్తే ధరణి పోర్టల్‌ను ఎత్తివేసి భూమాత పేరిట పాత రెవెన్యూ పద్ధతిని ప్రవేశపెడతామని ప్రకటించడంపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆది నుంచి వ్యవసాయ రంగానికి పెద్దపీట వేసిన సీఎం కేసీఆర్ ఇందులో భాగంగానే దశాబ్దాల తరబడి పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల పరిష్కారానికి ధరణి పోర్టల్‌ను ప్రవేశపెట్టారు. గతంలో భూముల రిజిస్ట్రేషన్, పట్టాపాసు పుస్తకాల కోసం నెలల తరబడి రిజిస్ట్రేషన్ ఆఫీసులు, రెవెన్యూ కార్యాలయాలు తిరిగే పరిస్థితి ఉండేది. రైతుల కష్టాలను దూరం చేయడంతోపాటు ప్రభుత్వ ప్రయోజనాలు అనర్హులకు దక్కొద్దనే సంకల్పంతో సీఎం కేసీఆర్ ధరణి పోర్టల్‌ను ప్రారంభించారు. దీంతో భూముల సమస్యలు, రిజిష్ట్రేషన్లు తక్షణమే పూర్తవుతున్నాయి. ధరణి పోర్టల్‌లో ఉన్న వివరాల ఆధారంగా రైతులకు పెట్టుబడి సాయం, రైతు బీమా తదితర పథకాలు టంచన్‌గా అదుతున్నాయి. కాంగ్రెస్ అంటున్నట్లు ధరణి పోర్టల్‌ను ఎత్తివేస్తే వ్యవస్థ మొత్తం ఆగమాగవుతుందని.. మళ్లీ బాంచన్ కాళ్లు మొక్కుతా అనే పరిస్థితి వస్తుందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయానికి ఎన్ని గంటల కరెంటు అవసరం పడుతుందో.. ఎన్ని హెచ్‌పీల మోటర్లు నడుస్తాయో తెలియని కాంగ్రెస్ నాయకులు అధికారం కోసం ఒక్కొక్కరు ఒక్కో విధంగా మాట్లాడడం విడ్డూరంగా మారిందంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారు. అమలుకు సాధ్యం కాని హామీలు ఇస్తూ సంతోషంగా సాగుతున్న తమ జీవితాల్లో చిచ్చుపెట్టాలని చూస్తే తగిన బుద్ధి చెబుతామని రైతులు హెచ్చరిస్తున్నారు.

### ధరణి ఉండాల్సిందే..



కోటగిరి నవంబర్ 18 : కేసీఆర్ సారు రైతుల కోసం తీసుకొచ్చిన ధరణి పోర్టల్ ఉండాల్సిందే.. ధరణితో రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. నిమిషాల్లో రిజిస్ట్రేషన్ పనులు అయిపోతున్నాయి. ఇంతకు ముందు కాంగ్రెస్ హయాంలో రిజిస్ట్రేషన్, పాస్ పుస్తకాలు కావాలన్నా నెలల తరబడి వేచి ఉండాల్సి వచ్చేది. కానీ కేసీఆర్ ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణితో పుస్తకాలు వారంలోనే వస్తున్నాయి. ధరణి తీస్తామని చెప్పే కాంగ్రెస్ నా యకులకు అధికారం ఇవ్వకూడదు.. వాళ్లు వస్తే మళ్లీ రైతులకు కష్టాలు తప్పవు. కాబట్టి రైతులకు మద్దతుగా నిలిచే బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి అండగా ఉండాలి.

**- నల్ల గంగాధర్, రైతు కోటగిరి**

### మార్పులు చేస్తే రైతులకు ఇక్కట్లు



సిరికొండ : కాంగ్రెస్ పార్టీ భూమాత పోర్టల్ తెచ్చి రికార్డుల్లో కౌలుదారు/అనుభవదారు కాలం పెట్టడంతో రైతులు ఆఫీసుల చుట్టూ తిరగాల్సి వస్తుంది. దీంతో సమయం వృథాతో పాటు ఆర్థికంగా నష్టం జరుగుతుంది. పాత కాలంలాగా పట్వారీ ఉంటే వాళ్లు డబ్బులు తీసుకొని పని చేయకుండా తిప్పుతారు. ధరణి వచ్చాక మాకు ఎంతో మేలు జరిగింది. స్లాట్‌బుక్ చేసుకున్నాక తెల్లారి 30 నిమిషాల్లో పట్టా మా పేరుపై మారాయి. కాంగ్రెస్ వాళ్లకు రైతుల కష్టాలు తెల్వదు.

**- మోతె చిన్నారెడ్డి, రైతు, హుస్సేన్‌నగర్, సిరికొండ మండలం**

### కాంగ్రెస్ రాదు.. భూమాత తేదు



కాంగ్రెస్ పార్టీ అధికార దాహంతో ఏదేదో మాట్లాడుతున్నదే తప్ప ఆ పార్టీ అధికారంలోకి వచ్చేది లేదు, భూమాత పోర్టల్‌ను కొత్తగా తెచ్చేది లేదు. ప్రస్తుతమున్న ధరణి పోర్టల్ ద్వారా అక్రమాలకు ఆస్కారం లేకుండా పోయింది. పాత పద్ధతిలో వీఆర్వోలు ఆడిందే ఆట, పాడిందే పాటగా ఉండేది. ఇప్పుడు ధరణి పోర్టల్ ద్వారా అంతా ఆన్‌లైన్ చేయడంతో రైతు బయోమెట్రిక్ ద్వారానే చేర్పులు, మార్పులు చేయగలుగుతున్నాం. ఇలాంటి తుగ్లక్ చర్యలు మానుకోకపోతే వచ్చే ఎన్నికల్లో రైతులందరం కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్పి తీరుతాం.

**- అబ్దుల్ మాజీద్, ధర్పల్లి గ్రామం**

### పాత పద్ధతి మాకు వద్దు



కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మళ్లీ పాత పద్ధతి తీసుకువస్తామంటున్నది. మాకు పాత పద్ధతి వద్దు. కాంగ్రెస్ పార్టీ కూడా మాకు అవసరం లేదు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాదు. పాత రెవెన్యూ పద్ధతి మళ్లీ తిరిగి రాదని మాకు తెలుసు. ప్రజలకు మేలు చేసే పథకాన్ని మారుస్తామనడం కాంగ్రెసోళ్ల ప్రజావ్యతిరేక విధానాలకు నిదర్శనం. రైతులకు మేలు చేసే పథకాన్ని మారుస్తామంటే తగిన బుద్ధి చెబుతాం. రైతులకు మేలు చేస్తున్న ధరణి పోర్టల్‌నే కొనసాగించాలనుకుంటున్నాం కాబట్టి బీఆర్‌ఎస్‌కే ఓటు వేస్తాం.

**-పెద్దిదాక సాయవ్వ, మహిళా రైతు, హోన్నాజీపేట్ గ్రామం, ధర్పల్లి మండలం**